


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 176 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : శ్రీకాకుళం | మంగళవారం 7 జూలై 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 176 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : SRIKAKULAM | TUE 7 JULY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## రూ.70 వేలు లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

- సిద్ధిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్
- చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు
- నాలా కన్వర్షన్ కోసం రూ.70,000 డిమాండ్ చేసినట్లు ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:సిద్ధిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్‌గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం

- మిగతా 2లో

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

- ఇండోనేషియాకు చేరిన ప్రధాని మోదీ
- స్వయంగా వచ్చి ఆహ్వానించిన అధ్యక్షుడు ప్రబోవో
- యుద్ధ విమానాలతో మోదీ విమానానికి ఎస్కార్ట్
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ప్రంబనన్ ఆలయ సముదాయం సందర్శించనున్న మోదీ
- రక్షణ, వాణిజ్య సహకార విస్తరణపై దృష్టి

- మిగతా 2లో





## మైక్రోసాఫ్ట్‌లో భారీ లేఆఫ్‌లు.. 4,800 ఉద్యోగాల కోత..!

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ లేఆఫ్‌లు ప్రకటించింది. తమ సంస్థలో 4,800 మంది ఉద్యోగులను తొలగించనుంది. ఇది ఆ కంపెనీ ప్రపంచ వ్యాప్త ఉద్యోగుల్లో 2.1 శాతం

- మిగతా 2లో

## ఏపీలో కాగ్నిజెంట్.. విశాఖ ఐటీ సెజ్‌కు కేంద్రం ఆమోదం

- విశాఖలో కాగ్నిజెంట్ ఐటీ సెజ్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మధురవాడలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో దీని ఏర్పాటు
- తెలంగాణలో రెండు సెజ్‌ల ప్రతిపాదనలను వెనక్కి తీసుకున్న సంస్థ
- ఈ ప్రాజెక్ట్‌తో భారీగా ఉద్యోగాలు వస్తాయని అంచనా
- సెజ్‌ను ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోగా ప్రకటించిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగాన్ని పరుగులు పెట్టించే కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ

- మిగతా 2లో



## నేడు,రేపు కడప జిల్లాలో పర్యటించనున్న జగన్

- నేడు ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకోనున్న జగన్
- నేడు రాత్రికి పులివెందులలోనే బస
- రేపు ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రేపటి నుంచి రెండు రోజుల పాటు కడప జిల్లాలో పర్యటించనున్నారు. పార్టీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... రేపు ఉదయం 11.30 గంటలకు

- మిగతా 2లో






## ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...

### సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు


- ప్రజా సమస్యలపై రియల్ టైమ్‌లో స్పందించాలని అధికారులకు సీఎం ఆదేశం
- పీజీఆర్ఎస్ కింద పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- పట్టణ ప్రాంతాల్లో జీరో వేస్ట్ లక్ష్యంగా మూడు నెలల్లో చెత్త తొలగింపు
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలి, మహిళల భద్రతకు పెద్దపీట
- మారుమూల గ్రామాల్లో కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ

పెన్ పవర్ డెస్క్:ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్ టైమ్‌లోనే స్పందన ఉండాలని, ప్రభుత్వ సేవల్లో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన, సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీ) కేంద్రంలో ఉన్నతాధికారుల తో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలమని, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అన్నారు.రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి ప్రజలకు వాస్తవ సమయంలోనే స్పందన అందాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సముద్ర తీరంలో

- మిగతా 2లో


## విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు: అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం




**విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సమీక్ష**

- ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం
- మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు



> "రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యం."
> – సీఎం చంద్రబాబు నాయుడు

### 51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ

**ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను తలదన్నేలా, లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు.

**'వైజాగ్ బే సిటీ'.. పర్యాటక సర్క్యూట్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు-పాడేరు-విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని,

- మిగతా 2లో

"రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం – మూడు రీజియన్లు, ఒక లక్ష్యం: స్వర్ణాంధ్ర 2047"



## నా రక్తంలోనే కాషాయం ఉంది

### పేర్ని నాని విమర్శలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కౌంటర్!

- చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే వ్యక్తి పేర్ని నాని అని సత్యకుమార్ ఎద్దేవా
- తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తి కాదని వ్యాఖ్య
- జగన్ ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమన్న మంత్రి

- మిగతా 2లో



## ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్.. బెంగళూరు, చెన్నై వెనక్కి!

- దక్షిణాదిలో రూ.11,246 కోట్లకు చేరిన లగ్జరీ గృహాల విక్రయాలు
- ఈ అమ్మకాలలో రూ.8,562 కోట్లతో హైదరాబాద్ అగ్రస్థానం
- బెంగళూరు, చెన్నై నగరాలను అధిగమించిన భాగ్యనగరం
- రూ.10 కోట్లకు హైదరాబాద్‌లో అత్యధికంగా 6,210 చదరపు అడుగుల స్థలం
- ఐటీ, వ్యాపార రంగాల అభివృద్ధే ఈ డిమాండ్‌కు కారణమని నివేదిక వెల్లడి

- మిగతా 2లో

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

- కక్ష సాధింపులకు పోలీసులను ప్రభుత్వం వాడుకుంటోందన్న అంబటి
- సాధారణ యూట్యూబర్ రావణ్‌పై దేశద్రోహం చట్టాలను ప్రయోగించారని మండిపాటు
- రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాం గాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు

- మిగతా 2లో



## ఒక్కటి కూల్చితే.. వంద కడతాం

### హైడ్రా నోటీసులపై అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు!

- ఫాతిమా కాలేజ్ పేరుతో తమను భయపెట్టాలని చూస్తున్నారన్న అక్బరుద్దీన్
- తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్న ఎంఐఎం ఎమ్మెల్యే
- పేదల కోసం వంద విద్యాసంస్థలు నిర్మిస్తామని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# కేంద్ర కేబినెట్ విస్తరణకు బ్రేక్...

**న్యూఢిల్లీ, జూలై 6 (న్యూస్ పల్స్):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మోదీ తన టీమ్‌ను పూర్తిస్థాయిలో మార్చేస్తారని, పనితీరు సరిగ్గా లేని మంత్రులను తొలగించి కొత్త ముఖాలకు, ముఖ్యంగా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేస్తారని అనుకున్నారు. అయితే, శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వర్షాకాల సమావేశాల అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో.. ఢిల్లీ పొలిటికల్ సమీకరణాలు ఒక్కసారిగా మారిపో యాయి. పార్లమెంట్ వేదికగా అత్యంత కీలకమైన సెషన్ నడవబోతున్న తరుణంలో.. ఈ లోపు క్యాబినెట్ విస్తరణ చేపట్టే సాహసం ప్రధాని మోదీ చేయడం లేదని, ఈ మార్పు చేర్పుల ప్రక్రియను ఆయన వ్యూహాత్మకంగా వాయిదా వేశారని క్లారిటీ వచ్చిందికేంద్ర కేబినెట్ మార్పుచేర్పుల వాయిదా వెనుక ఒక పక్కా పొలిటికల్ టైమింగ్ దాగి ఉందని తెలుస్తోంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న సమావేశాల ముందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోంది. ముఖ్యంగా పీఎం, సీఎంల ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ జూలై 17న తన నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు వన్ నేషన్ -- వన్ ఎలక్షన్ బిల్లుపై కూడా ఉభయ సభల్లో వాడివేడి చర్చలు జరగనున్నాయి. ఇలాంటి అత్యంత సంక్లిష్టమైన చట్టాలు పాస్ కావాల్సిన సమయంలో క్యాబినెట్‌ను కదిలిస్తే.. ప్రయారిటీ మారిపోతుందని అనుకుంటున్నారు.పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత, ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ మెగా క్యాబినెట్ విస్తరణ , బిజెపి సంస్థాగత మార్పులు ఏకకాలంలో జరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా క్యాబినెట్ విస్తరణపై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాల్సిన అవసరాన్ని ప్రధానికి గుర్తుచేశాయి జూన్ చివరి వారంలో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవ్వడం, ఆ తర్వాత వివిధ శాఖల కార్యదర్శులతో వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘ సమీక్షలు నిర్వహించడం వెనుక.. ఏ ఏ మంత్రుల పనితీరు ఎలా ఉందో స్వయంగా నివేదికలు తెప్పించుకోవడానికేనని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వ మనుగడ, రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను బ్యాలెన్స్ చేయాల్సి ఉన్నందున.. తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం కంటే, పూర్తి స్థాయి నివేదికలతో సెప్టెంబర్‌లో రంగంలోకి దిగడమే ఉత్తమమని ప్రధాని డిసైడ్ అయ్యారు.ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రివర్గ మార్పులపై వెనక్కి తగ్గలేదు, కేవలం సమయాన్ని మాత్రమే మార్చారు. వర్షాకాల సమావేశాల రూపంలో విపక్షాల నుండి రాబోయే పొలిటికల్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, తమకు కావలసిన కీలక బిల్లులను పార్లమెంట్‌లో గట్టెక్కించుకోవడమే ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఆ తర్వాతే.. సెప్టెంబర్ వేదికగా 'టీం మోదీ' లోకి సరికొత్త భారీ మార్పులు, భారీ చేర్పులు ఉండబోతున్నాయనేది ఢిల్లీ వర్గాల అంచనా.

## ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...

- మొదటి పేజి తరువాయి

బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనను ఉదాహరణగా చూపుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత తక్షణమే సమన్వయంతో స్పందించాయన్నదే కీలకమని అన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో తరచూ మల్టీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ సమావేశాలు జరగాలని సూచించారు. ఆర్టీజీ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు."ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో 'లాస్ట్ మైల్ గవర్నెన్స్' ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్, బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి," అని ముఖ్యమంత్రి విశ్లేషించారు.

**పీజీఆర్ఎస్ పరిష్కారానికి యాక్షన్ ప్లాన్**

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పట్టణాల్లో 'జీరో వేస్ట్' లక్ష్యం**

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాబోయే మూడు నెలల్లోగా యుద్ధప్రాతిపదికన తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 'జీరో వేస్ట్' సాధించడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బృహత్కార్యంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ వంటి కార్యక్రమాలపై నిర్దిష్ట ప్రామాణిక కార్యాచరణ విధానం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

- మొదటి పేజి తరువాయి

పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు.వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు.రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరఫున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు.కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

# ఏపీలో కాగ్నిజెంట్.. విశాఖ ఐటీ సెజ్‌కు కేంద్రం ఆమోదం

- మొదటి పేజి తరువాయి

సొల్యూషన్స్.. విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ జూన్ 25నే తుది నోటిఫై చేసింది.

విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీ-మధురవాడ-2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి జూన్ 11న కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను 'ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో'గా కూడా ప్రకటించడం విశేషం.కొన్ని నెలల క్రితం, ఫిబ్రవరిలో, తెలంగాణలోని నానక్‌రామ్‌గూడ, ఆదిభట్లలో రెండు ఐటీ సెజ్‌ల ప్రతిపాదనలను కాగ్నిజెంట్ వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు విశాఖలో భారీ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్‌తో సుమారు రూ.1,580 కోట్ల పెట్టుబడి, దాదాపు 8,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. దశలవారీగా పూర్తిస్థాయి క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుండగా, విశాఖపట్నం ఐటీ స్వరూపాన్ని ఈ ప్రాజెక్ట్ సమూలంగా మార్చనుందని నిపుణులు భావిస్తున్నారు.

# విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు

- మొదటి పేజి తరువాయి

సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**అమరావతి, తిరుపతి రీజియన్ల అభివృద్ధి**

రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు.స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

# జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని భావిస్తున్నారు.భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది.ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్-ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు.పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు.ఇండోనేషియాలోని భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్-ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి.ఇండోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

# ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్.. బెంగళూరు, చెన్నై వెనక్కి!

దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన నగరాల్లో అల్ట్రా-లగ్జరీ గృహాల మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన 811 విలాసవంతమైన ఇళ్లు అమ్ముడయ్యాయి. వీటి మొత్తం అమ్మకాల విలువ రూ.11,246 కోట్లుగా నమోదైంది. ఈ వివరాలను 'సదరన్ ఇండియా హై-ఎండ్ లగ్జరీ హౌసింగ్' పేరుతో ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది.ఈ విక్రయాల్లో హైదరాబాద్ నగరం స్పష్టమైన ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క హైదరాబాద్‌లోనే 625 లగ్జరీ ఇళ్లు అమ్ముడుపోగా, వాటి విలువ రూ.8,562 కోట్లుగా ఉంది. హైదరాబాద్ తర్వాత బెంగళూరులో 128 ఇళ్ల అమ్మకాల ద్వారా రూ.1,957 కోట్లు, చెన్నైలో 58 ఇళ్ల విక్రయాల ద్వారా రూ.727 కోట్ల వ్యాపారం జరిగింది. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో తక్కువ ధరకే ఎక్కువ స్థలం లభించడం ఈ వృద్ధికి కీలక కారణంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.10 కోట్లతో హైదరాబాద్‌లో సుమారు 6,210 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కొనుగోలు చేయగలిగితే, అదే మొత్తానికి చెన్నైలో 4,290 చదరపు అడుగులు, బెంగళూరులో కేవలం 3,930 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తోంది. హైదరాబాద్‌లోని కోకాపేట, బెంగళూరులోని రాజనుకుంటె ప్రాంతాలు అల్ట్రా-ప్రీమియం ప్రాజెక్టులకు హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి.ఈ నివేదికపై ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ సీఈఓ అశ్విన్ చద్దా మాట్లాడుతూ, "దక్షిణ భారతదేశంలోని లగ్జరీ గృహాల మార్కెట్ మూడు విభిన్న నగరాల ప్రత్యేకతలతో రూపుదిద్దుకుంటోంది. అమ్మకాల పరిమాణంలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుండగా, బెంగళూరు వేగవంతమైన వృద్ధి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. మరోవైపు చెన్నై తన పాత, ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ప్రాంతాలపై ఆధారపడి స్థిరంగా కొనసాగుతోంది," అని వివరించారు.సీఆర్ఈ మ్యాట్రిక్స్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ అభిషేక్ కిరణ్ గుప్తా మాట్లాడుతూ, ఈ రంగం ఒక కీలక మలుపుకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మార్కెట్‌కు బలమైన పునాదులు ఉన్నాయని, బెంగళూరు సంప్రదాయ ఉన్నత వర్గాల ప్రాంతాలకు అతీతంగా విస్తరిస్తోందని పేర్కొన్నారు. ప్రతి మార్కెట్‌కు అనుగుణంగా ప్రత్యేకమైన పెట్టుబడి వ్యూహాలు అవసరమని ఆయన సూచించారు. ఈ నగరాలు ఐటీ, వ్యాపార కేంద్రాలుగా వేగంగా వృద్ధి చెందడంతో అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు, సంపన్న కొనుగోలుదారులు విశాలమైన, అత్యున్నత సౌకర్యాలున్న గృహాల వైపు మొగ్గుచూపుతున్నారని నివేదిక స్పష్టం చేస్తోంది.

# నేడు,రేపు కడప జిల్లాలో పర్యటించనున్న జగన్

- మొదటి పేజి తరువాయి

జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక ప్రజలు, నాయకులను కలుసుకుంటారు. అక్కడ 'ప్రజాదర్బార్' నిర్వహించి, ప్రజల నుంచి స్వయంగా వినతులు, సమస్యల అర్జీలను స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలోనే బస చేస్తారు. బుధవారం ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి 7.30 గంటలకు ఆయన ఇడుపులపాయకు చేరుకుంటారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని.. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ సంస్మరణ కార్యక్రమం ముగిసిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగుప్రయాణం అవుతారు.

## ఒక్కటి కూల్చితే.. వంద కడతాం

# హైడ్రా నోటీసులపై అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు!

సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారంటూ ఫాతిమా ఒవైసీ విద్యాసంస్థలపై హైడ్రా విచారణ జరుపుతున్న నేపథ్యంలో, చాంద్రాయణగుట్ట ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ గౌస్‌నగర్‌లోని విద్యా క్యాంపస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఫాతిమా కళాశాల పేరుతో తమను భయపెట్టాలని చూస్తున్నారని, తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు.తమ విద్యాసంస్థలను కూల్చివేస్తామంటూ వస్తున్న బెదిరింపులకు తలొగ్గే ప్రసక్తే లేదని, వాటిని ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసని అక్బరుద్దీన్ హెచ్చరించారు. "ఒక్క విద్యాసంస్థను కూల్చేస్తే.. పేద ప్రజల కోసం వంద విద్యాసంస్థలను నిర్మించి చూపిస్తాం" అని ఆయన సవాల్ విసిరారు. సంస్థలు ఉన్నా లేకపోయినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు.ఈ సందర్భంగా సాలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ హోదాలో 366 మంది పేద విద్యార్థుల పేరున రూ.కోటీ 19 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు.

# రూ.70 వేలు లంచం..

## ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

- మొదటి పేజి తరువాయి

అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు.

సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# నా రక్తంలోనే కాషాయం ఉంది

వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన.. పేర్ని నానిని 'చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే వ్యక్తి'గా అభివర్ణించారు. తాను రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారే అవకాశవాదిని కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. "నేను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదు. నా రక్తంలోనే కాషాయం, బీజేపీ సిద్ధాంతం ఉన్నాయి. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఒక మంత్రిగా... ప్రభుత్వంపై చేసే అర్థరహితమైన విమర్శలను చూస్తూ ఊరుకోను" అని సత్యకుమార్ హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ ను తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ దూషించలేదని... ఆయన అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమని చెప్పారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అని, రాజధాని విషయంలో ఆయన మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కనీస అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేసి, అతి త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి చిన్న సమస్య, ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# మైక్రోసాఫ్ట్‌లో భారీ లేఆఫ్‌లు.. 4,800 ఉద్యోగాల కోత..!

- మొదటి పేజి తరువాయి

కావడం గమనార్హం. ఏఐ (కృత్రిమమేధ) పెట్టుబడులు, వ్యయ నియంత్రణపై మరింతగా దృష్టి సారిస్తుండటంతో సిబ్బందిని తగ్గించుకొనేలా చర్యలు చేపట్టినట్లు కథనాలు వస్తున్నాయి. టెక్ దిగ్గజ కంపెనీలైన అమెజాన్, మెటా కూడా ఈ ఏడాది వేలాది ఉద్యోగాల కోతను ప్రకటించాయి. ఈ ఏడాది పెద్ద టెక్నాలజీ కంపెనీల ఇూ× పెట్టుబడులు 700 బిలియన్ డాలర్లను మించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగాల కోత ఉండొచ్చంటూ మే నెలలోనే మైక్రోసాఫ్ట్ సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా లేఆఫ్‌ల ప్రభావం మైక్రోసాఫ్ట్‌కు చెందిన గేమింగ్ విభాగం 'ఎక్స్‌బాక్స్'పై అధికంగా పడినట్లు తెలుస్తోంది. శరవేగగంగా మారుతున్న టెక్నాలజీ పరిశ్రమలో వినియోగదారుల అవసరాలకనుగుణంగా ఫలితాలను ఇచ్చే విభాగాలపై తాము మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మెక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అమీ కోల్‌మన్ ఉద్యోగులకు పంపిన ఓ అంతర్గత మెమోలో పేర్కొన్నారు. ఈ భారీ ఉద్యోగాల కోతల వల్ల ఎక్స్‌బాక్స్ విభాగంలోనే 1600కు పైగా ఉద్యోగాలు రద్దవుతాయని సమాచారం.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# దేవరపల్లి పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలపై వినతులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 6:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.జీసీసీ సేవలు, అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు, డ్రైనేజీల ఏర్పాటు, పీఎం కిసాన్ లబ్ధి అందకపోవడం, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. పలువురు రైతులకు ఇప్పటికీ పీఎం కిసాన్ నగదు జమ కాలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మంగలపాలెం గ్రామంలో పాఠశాల భవనం నిర్మించి, వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో, ఏపీవో రాంప్రసాద్, హౌసింగ్ ఏఈ విమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోహిని, పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముఖర్జీ చేసిన సేవలు మరువలేనివి.

# ఆయన సేవలు చిరస్మరణీయం.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 6.**భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ జాతీయవాది డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను ఆదివారం చింతపల్లిలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ చింతపల్లి మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మండల పార్టీ ఇన్‌చార్జి పెనుమాక రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నాయకులు డాక్టర్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెనుమాక రవికుమార్ మాట్లాడుతూ.. దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ తన జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని కొనియాడారు. భారతదేశ ఐక్యత కోసం ఆయన చేసిన అత్యున్నత త్యాగాలు దేశ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని స్పష్టం చేశారు. నేటి యువత ఆయన ఆశయాలను, జాతీయవాద భావాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి, నవభారత నిర్మాణానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు లకే అబ్బాయిదొర, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కదుళ్ల శ్రీనివాసరావు, తాజంగి నీటి సంఘం అధ్యక్షుడు బోనంగి బాలయ్య పడాల్, జిల్లా ఐటీ కన్వీనర్ పండా ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శులు కిషోర్, మహేష్, మాతే లక్ష్మణ్ తదితరులతో పాటు వివిధ మోర్చాల బాధ్యులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డుపక్కన మృత్యువులా నిలిచిన ఎండిన భారీ వృక్షాలు..!

- రింతాడ--ఆర్వీ నగర్ ప్రధాన రహదారిపై ప్రయాణికుల్లో భయం
- అటవీ--ఆర్ అండ్ బి శాఖల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 6**:గూడెం కొత్తవీధి మండలంలోని రింతాడ నుంచి ఆర్వీ నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా ఎండిపోయిన భారీ వృక్షాలు ప్రయాణికులకు ప్రాణహానిగా మారాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో కాలం చెల్లిన చెట్లు, భారీ కొమ్మలు ఎప్పుడు విరిగి పడతాయోనన్న ఆందోళనతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవడంతో పాటు ఈదురుగాలులు వీచే పరిస్థితుల్లో ఈ ఎండిన వృక్షాలు ప్రమాదాన్ని మరింత పెంచుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చెట్లు, భారీ కొమ్మలు వాహనాలపై పడటంతో ప్రాణనష్టం, గాయాలు సంభవించిన ఘటనలను గుర్తు చేస్తూ, అలాంటి ప్రమాదాలు ఇక్కడ కూడా జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యుత్ లైన్లకూ పెరిగిన ముప్పు:**

రోడ్డు పక్కన ఉన్న ఎండిపోయిన కొమ్మలు హైటెన్షన్ విద్యుత్ లైన్లను తాకే స్థితిలో ఉండటంతో మరో ప్రమాదం పొంచి ఉంది. బలమైన గాలులు వీచిన సమయంలో ఈ కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడితే విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు లైవ్ వైర్లు రోడ్డుపై పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడటమే కాకుండా, ప్రయాణికుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

**శాఖల మధ్య సమన్వయ లోపమే కారణమా..?**

ప్రమాదకరంగా మారిన వృక్షాలను గుర్తించి తొలగించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అటవీ శాఖ, ఆర్ అండ్ బి శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక శాఖ అనుమతుల కోసం మరో శాఖ ఎదురు చూడడంతో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని విమర్శిస్తున్నారు.

**ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందుగానే ఎండిపోయిన





చెట్లు, ప్రమాదకరమైన కొమ్మలను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని ప్రజలు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు. వర్షాకాలంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నర్సీపట్నం మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రణాళికలు




స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, పెన్ పవర్ (జూలై 6) :**నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్కెట్ కమిటీ బోర్డు మెంబర్స్ తో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజయ్యారు. ముందుగా మార్కెట్ యార్డును పరిశీలించిన ఆయన, అధికారులకు, కమిటీ సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూతన మార్కెట్ కమిటీ ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పాలకవర్గం సాధించిన ప్రగతిని ఆయన అభినందించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన యార్డును, ఇప్పుడు గాడిలో పెట్టి ఒక క్రమపద్ధతిలోకి తీసుకువచ్చామని హర్షం వ్యక్తం చేశారు. ఆదాయం పెంచేందుకు చెక్ పోస్ట్ ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు వంటి పటిష్టమైన చర్యలు తీసుకోవడం వల్ల అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం మార్కెట్ యార్డ్ ఆదాయపరంగా రెండో స్థానంలో నిలిచిందని ఆయన ప్రశంసించారు. యార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. రైతులకు, వ్యాపారులకు మరింత లబ్ధి చేకూర్చేలా పది శాశ్వత దుకాణాల నిర్మాణం, రైతుబజార్ ఆధునికీకరణ, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు, ఉత్పత్తులను ఆరబెట్టుకునే యంత్రాల కొనుగోలు, మట్టి నమూనా పరీక్షా కేంద్రాన్ని తిరిగి తీసుకురావడం వంటి అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. ఈ నెలాఖరుకల్లా ప్రభుత్వ అనుమతులు సాధించి, ఆయా పనులను పట్టాలెక్కించేందుకు మార్కెట్ కమిటీ సభ్యులు ఎంతో పట్టుదలతో ఉన్నారని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి డైరెక్టర్లందరూ బాధ్యతగా సమావేశాలకు హాజరవుతూ యార్డ్ ప్రగతికి సహకరించాలని స్పీకర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ చిటికెల కన్నయ్యానాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర, అధికారులు బోర్డు నెంబర్లు పాల్గొన్నారు.

# ఈనెల 8న నల్గొండలో వైయస్సార్ జయంతి వేడుకలు

**మండల వైఎస్ఆర్సిపి పార్టీఅధ్యక్షుడు “బిడిజన అప్పారావు” పిలుపు**




**కొయ్యూరు, పెన్ పవర్ జులై 6:**సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత మహా నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఈనెల 8న నల్గొండలో నిర్వహించడం జరుగుతుందని మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు బిడిజన అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం నల్లగొండలో వైయస్సార్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు వివిధ పదవులను అలంకరించిన కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు విధిగా హాజరై జయంతి వేడుకలను విజయవంతం చేయాలని అప్పారావు కోరారు




# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి చెక్..!

- గైర్హాజరైన అధికారులపై సస్పెన్షన్ వేటు
- జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ఎవరినీ ఉపేక్షించం: కలెక్టర్ నిషాంతి. టి

**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు/గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 6**:ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులకు ఇక కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంతి. టి స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా రూపకల్పన కార్యక్రమంలో విధులకు గైర్హాజరై బాధ్యతలను విస్మరించిన ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు సోమవారం కలెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.విధులకు హాజరుకాని ఓ పంచాయతీ కార్యదర్శి, అలాగే బూత్ లెవెల్ అధికారి ( బిఎల్వో )గా బాధ్యతలు నిర్వర్తిస్తూ నిర్లక్ష్యం ప్రదర్శించిన ఓ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి అధికారి, ఉద్యోగిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విధుల్లో ఎలాంటి అలసత్వాన్నీ సహించబోమని, ఎన్నికల సంఘం నిర్దేశించిన బాధ్యతలను విస్మరించినా లేదా విధులకు గైర్హాజరైనా చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి అధికారి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, బూత్‌ల పరిధిలో ఎన్నికల కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి స్పష్టం చేశారు.



## పరిమితికి మించి పిల్లలతో స్కూలు ఆటోలను నడపవద్దు.

- చింతపల్లి సిఐ బి. సింహాచలం.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 6.** నిత్యం స్కూల్ పిల్లలకు ఆటోల ద్వారా తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను ఎక్కించి తీసుకువెళ్లకూడదని చింతపల్లి సీఐ బి సింహాచలం అన్నారు. సోమవారం స్కూల్ పిల్లలను తీసుకెళ్లి ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి స్కూలు పిల్లలను ఎక్కించి తీసుకొని వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అటువంటి సందర్భాల్లో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. డ్రైవర్ కు ఇరువైపులా పిల్లలను కూర్చోబెట్టి తీసుకువెళ్లడం మంచిది కాదన్నారు. అలాగే స్కూల్ బ్యాగులను ఆటో పక్కన పెట్టి డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఆటోకి ఇరువైపులా స్కూల్ బ్యాగులను తగిలించడం వల్ల వెనుకగా వచ్చే వాహనాలను గుర్తించడానికి అవకాశం ఉండకపోవచ్చును అన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోలకు సంబంధించి అన్ని రకాల కాగితాలు కలిగి ఉండాలన్నారు. నియమాలను ధిక్కరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎస్సై జి వీరబాబు, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## విద్యావంతులైన యువత రాజకీయాల్లో రాణించాలి.

- జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 6.** గిరిజన ప్రాంత ప్రజల భవిష్యత్తు మారాలంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విద్యావంతులైన యువకులు రాజకీయాల్లో రాణించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుచ్చిబాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అవినీతి, దోపిడి, లంచగొండితనంతో భ్రష్టు పట్టే ప్రజా నాయకులను అధికారులను అరికట్టి, నవ సంఘ సమాజం నిర్మించే విధంగా యువత చైతన్యవంతులు కావాలని కోరారు. ప్రజాగోడు ప్రజానాడి విని మార్పు కోరే యువత ప్రజా జీవితాలలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యావంతులైన యువకుల వలనే సమాజంలో మార్పు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. నేటి యువత చైతన్యం లేక మన్యం గిరిజన ప్రాంతాలలో కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఎక్కడ పరిస్థితి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. ఉన్నతమైన విద్యాభ్యాసం చేసిన యువత మార్పును కోరుకుని రాజకీయాల్లో రాణించాలన్నారు. మార్పుకు సహకరించని నాయకులను అధికారులను ప్రశ్నించాలని ఆయన కోరారు. అప్పుడే గిరిజన ఆదివాసుల మనుగడ వ్యవస్థకు బలం చేకూరుతుందన్నారు.

## హెల్మెట్ లేకుంటే ప్రాణాలకు ముప్పు

- ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్
- ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలానాలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 6 :** నగరంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు సోమవారం ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాజీ జంక్షన్, సప్తగిరి జంక్షన్, పెట్రోల్ బంక్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులను ఆపి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ భవ్య రెడ్డి ఆధ్వర్యంలో, వెస్ట్ సర్కిల్ ట్రాఫిక్ సీఐ కే.సురేష్, ఎస్సై ఆర్.సూరిబాబు తమ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిబుల్ రైడింగ్ చేయరాదని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుని వెంట ఉంచుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగా తలకు తీవ్ర గాయాలు కావడం, ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం హెల్మెట్ ధరించి మాత్రమే ప్రయాణించాలని కోరారు. అలాగే కార్లు నడిపే వారు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే మోటారు వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు వివరించారు. కౌన్సెలింగ్ అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మోటారు వాహన చట్టం ప్రకారం చలానాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్, పోలీస్ కానిస్టేబుళ్లు రమణ, చిన్నబాబు, రాజునాయుడు, హోంగార్డ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన డి పారి నాయుడు.

**రైతు సాధికార సంస్థ (ఆర్.వై.ఎస్.ఎస్)సిలబస్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్.డి.పారి నాయుడు.**



**గుమ్మలక్ష్మీపురం జులై 06 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం మండలం లోవముతా ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం నాబార్డ్ ఆర్థిక సహకారంతో,జట్టు సంస్థ పర్యవేక్షణలో అమలు జరుగుచున్న పలు గ్రామాల్లో పిఎండిఎస్ పంటలను డాక్టర్.డి.పారి నాయుడు,సోమవారం నాడు పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ,వాతావరణ శాస్త్రజ్ఞుల సూచనలు మేర,ఎల్ నినో ప్రభావం తట్టుకునే పంటలు,నీటి తడులు తక్కువ అవసరం ఉన్న పంటలైన చిరుధాన్యాలు,శ్రీవరి,శ్రీ రాగి,వేరుశనగ,కొమ్ము శనగ,పెసలు,మినుములు,సూర్యకాంతం మరియు వివిధ రకాలైన పంట నమునాలు వేసుకోవడం వల్ల ఆర్థికంగా నష్టపోకుండా,ఏ విధమైన రసాయనికి ఎరువులు,పురుగు మందులు వాడుకుంటా,సహజంగా లభించే వనరులు ఉపయోగించుకోవడం వలన ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు.తక్కవ శ్రమతో,తక్కువ విస్తీర్ణంలోమార్కెట్ పరిస్థితులు బట్టి అధిక దిగుబడి నిచ్చే పంటలు రైతులు ఎంపిక చేసుకొని సాగు చేసినచో బహుల ప్రయోజనం పొందడం జరుగుతుందన్నారు.రైతులు పూర్తిస్థాయి విస్తీర్ణంలో,ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఖర్చులు తగ్గించుకొని,అధిక దిగుబడులు సాధించవచ్చు అని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆహార ఉత్పత్తులు ఇటు వినియోగదారులకు,అటు కొనుగోలుదారులకు ఉమ్మడిగా బహుళ ప్రయోజనం పొందవచ్చు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని రైతులు పూర్తి స్థాయిలో వినిగించుకోనీ సఫలీకృతం పొందాలన్నారు . అన్నపూర్ణ పంటలను నమూనాలను లోని వివిధ రకాల పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.వ్యవసాయ రంగ కార్యక్రమాలతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలైన గొర్రెల పెంపకం,కోళ్ళు పెంపకం,చేపల పెంపకం,మొదలగున కార్యక్రమాలు చేయడం వలన రైతులు త్వరిత గతింగా ఆర్థిక అభివృద్ధి పొందవచ్చని.రైతుల అధిక దిగుబలు సాధించాలంటే వారి యొక్క క్షేత్రాలను సారవంతం చేయాలని,తక్కువ ఖర్చుతో ఎక్కువ సారవంతం చెందడానికి పి.ఎం.డి.ఎస్ ఒక దిక్సూచిలా ఉపయోగపడుతుందన్నారు.దీని వలన భూమి సారవంతం చెందడంతో పాటు,అధిక దిగుబడులు ఆశాజనకంగా లభిస్తాయి అన్నారు.మొక్కలలో జీవవైద్యం పెంపొందించడం జరుగుతుందని.పరుగులు తెగులు తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు సాధికార సంస్థ కల్చరల్ విభాగం సీనియర్ కన్సల్టెంట్ రౌతు వాసుదేవరావు,జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి ప్రబాద్, ఉపాధ్యాయులు సతీష్,నీమ్మక సరస్వతి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ జూలై 6:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జీకే వీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ పిలుపునిచ్చారు. పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు ఈ నెల 8న బుధవారం ఉదయం 10 గంటలకు జీకే వీధి మండల కేంద్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించి, అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ మండల, గ్రామ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, 16 పంచాయతీల పార్టీ అధ్యక్షులు, 56 పోలింగ్ బూత్‌ల బీఎల్ఏలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, మండల యూత్ అధ్యక్షుడు కొర్ర బాబి, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు పాతూను లక్ష్మణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## సింహాచలం గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం





- అభివృద్ధి పనులను పరిశీలించిన ఈవో జల్లేపల్లి వెంకటరావు
- గిరి పౌర్ణమి నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం
- తాగునీరు, టెన్సైల్ షెడ్లు, టికెట్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

**సింహాచలం, పెన్ పవర్, జూలై 6 :** రానున్న గిరి ప్రదక్షిణ మహోత్సవాలను దృష్టిలో ఉంచుకుని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండపై, కొండక్రింద కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనుల పురోగతి, నాణ్యతను సమీక్షించిన ఆయన, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గిరి పౌర్ణమి సందర్భంగా వేలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అడవివరం సెంటర్ నుంచి గాంధీనగర్ మీదుగా స్వామివారి పుష్కరిణి వరకు ఉన్న రహదారిని ఈవో పరిశీలించారు. ఆలయ డీఈ ఇన్‌చార్జి రామరాజు, మాజీ కార్పొరేటర్ పీవీ నరసింహాతో కలిసి భక్తుల రాకపోకలకు అనువుగా అవసరమైన సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.

స్వామివారి తొలి పావంచ వద్ద నిర్మాణంలో ఉన్న టెన్సైల్ షెడ్ పనులను పరిశీలించిన ఈవో, గిరి పౌర్ణమి నాటికి వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ప్రత్యేక గట్టర్ల ఏర్పాటుపై అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

కొండ దిగువనున్న బస్సు స్టాండ్ వద్ద జరుగుతున్న పాత భవనం కూల్చివేత పనులను పరిశీలించిన ఈవో, బస్సుల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పనులను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాలు

కొండపై భక్తులకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు బ్లూ స్టార్ కంపెనీ నుంచి కొనుగోలు చేసిన వాటర్ కూలర్లను క్యూ లైన్లలో ఏర్పాటు చేస్తున్న పనులను ఈవో పరిశీలించారు. క్యూ లైన్లలో వేచి ఉండే భక్తులకు వారి వద్దకే తాగునీరు అందించేలా వాటర్ బ్యాక్ ట్యాంకులను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ దర్శన టికెట్లు, ఆర్జిత సేవల టికెట్లు, ప్రసాదాల టికెట్లను ఒకే కేంద్రంలో విక్రయించే విధంగా చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించిన ఈవో, పనులను వేగవంతం చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గజపతి సత్రంలో కొనసాగుతున్న ఇంజనీరింగ్, సానిటేషన్ పనులను పరిశీలించిన జల్లేపల్లి వెంకటరావు, పరిశుభ్రతతో పాటు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే దేవస్థానం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ డీఈ ఇన్‌చార్జి రామరాజు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శరభన్నపాలెం లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం...!



**50 పశువులు కుక్కలకు రెబిస్ టీకాలు.**

**కొయ్యూరు,పెన్ పవర్ జూలై 6:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కొయ్యూరు మండలంలోని శరభన్నపాలెం పశువుల హాస్పటల్ పరిధిలో 50 పెంపుడు కుక్కలకు,పశువులకు రాబీస్ వ్యాక్సిన్ టీకాలను ఉచితంగా వేసినట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ కె రాజేష్ కుమార్ తెలిపారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కుక్కల పెంపకం దారులతో డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 6 వ తేదీన ఈ రాబీస్ వ్యాక్సిన్ టీకాలను ఉచితంగా వేయనున్నట్టు ప్రకటించారు. దీనిలో భాగంగానే సోమవారం ఈ వ్యాక్సిన్ టీకాలను వేస్తున్నట్టు చెప్పారు. కుక్కల పెంపకం దారులు ఇంటి వద్ద వీటిని జాగ్రత్తగా పెంచుకోవాలని లేని పక్షంలో వేరే వ్యక్తులకు ఇవి కరిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లిన్నట్టు తెలిపారు.జంతువులు మరియు కుక్కల నుంచి మనుషులకు సోకే అతి ప్రమాదకరమైన ప్రాంతకర వ్యాధి అని దీనిని రాబీస్ పిచ్చి కుక్క వ్యాధి గా పిలుస్తారని తెలిపారు తగిన జాగ్రత్తలు కుక్కల యజమానులు పాటించాలని చూసించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, జెవిఓ ఆశాజ్యోతి, వి ఏ శ్రీనివాస్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైసిపి సీనియర్ కార్యకర్త తిరుపతి హఠాన్మరణం

- వైసీపీ ముఖ్య కార్యకర్తగా జెండా మోసి, జెండా కట్టి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన తిరుపతి.
- తిరుపతి కుటుంబాని పరామర్శించి భరోసానిచ్చిన వైసీపీ నాయకులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 06.** మండలానికి చెందిన వైసిపి సీనియర్ కార్యకర్త సోనియ తిరుపతి(60) సోమవారం హఠాన్మరణం చెందారు. కించాయిపుట్టు పంచాయతీ, మినుములపుట్టు గ్రామానికి చెందిన తిరుపతి ఓ సీనియర్ కార్యకర్తగా వైసిపి పార్టీ ఆవిర్భావం నుండి ఆయన పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి. మండల కేంద్రంలో వైసిపి కార్యక్రమాలు ఏది జరిగిన ఆయన ముందుండి జెండా మోసి జెండా కట్టి పార్టీ కొరకు అహర్నిశలు కష్టపడ్డాడు. అయితే ఆయన రోజంతా బాగుండి సాయంత్రం హఠాన్మరణం చెందటం పట్ల తన సన్నిహితులు జీర్ణించుకోలేక పోతున్నారు. తిరుపతి మరణం కుటుంబానికి కాక వైసిపి పార్టీకి కూడా తీరనిలోటనీ వైసీపీ నాయకులు పేర్కొన్నారు. తిరుపతికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల వైసీపీ నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా బదిలీ.

- మార్కాపురం ఓఎస్డీగా( పరిపాలన ) నియమిస్తూ ఉత్తర్వులు.
- మాదకద్రవ్యాల నిర్మూలనలో తనదైన ముద్రను వేసిన నవ జ్యోతి మిశ్రా.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 6.** రాష్ట్ర పోలీసు శాఖలో పరిపాలనాపరమైన బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇందులో భాగంగా చింతపల్లి ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రా బదిలీ అయ్యారు. ఆయనను మార్కాపురం జిల్లా ఓఎస్డీ (పరిపాలన)గా నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

చింతపల్లి ఏఎస్పీగా పనిచేసిన కాలంలో నవజ్యోతి మిశ్రా తనదైన శైలిలో విధులు నిర్వర్తించారు. మన్యం ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్న గంజాయి సాగు, అక్రమ రవాణాను అరికట్టడంలో ఉక్కుపాదం మోపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటూనే, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. స్థానికంగా జరిగే పండగలు, జాతరల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి సమర్థుడైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు.? జూద క్రీడలను పూర్తిగా కనుమరుగు చేశారు.మరోవైపు,మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన యువత గంజాయి లాంటి వ్యసనాల బారిన పడకుండా, వారిని క్రీడల వైపు ప్రోత్సహించడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారు. ఏజెన్సీలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహనదారుల్లో, యువతలో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, విధి నిర్వహణలో నిబద్ధత చూపిన ఈ యువ అధికారికి స్థానచలనం కలగడంతో స్థానికులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

# పెందుర్తిలో చైన్ స్నాచింగ్ కేసు ఛేదన

- వృద్ధురాలి మెడలోని రూ.9 లక్షల విలువైన బంగారం అపహరణ
- తల్లి--కొడుకుల అరెస్ట్..5 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం
- నేరానికి ఉపయోగించిన స్కూటీ సీజ్

**పెందుర్తి, పెన్ పవర్, జూలై 6** : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు వేగంగా ఛేదించి, నిందితులైన తల్లి--కొడుకులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు నేరానికి ఉపయోగించిన హోండా యాక్టివా (ఏపీ39 కేడి 5568) స్కూటీని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

అడ్రస్ అడుగుతున్నట్లు నటించి దోపిడీ

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి మండలం సుజాతనగర్‌కు చెందిన కీలపర్తి చెల్లయ్యమ్మ జూన్ 27న సాయంత్రం ద్వారకానగర్‌లో బంధువుల ఇంట జరిగే కార్యక్రమానికి వెళ్లేందుకు నడుచుకుంటూ సుజాతనగర్ ఆర్చ్ వైపు వెళ్తున్నారు. లిటిల్ ఫ్లవర్ ప్లే స్కూల్ సమీపానికి చేరుకోగానే ఒక నీలిరంగు స్కూటీపై వచ్చిన మహిళ, పురుషుడు ఆమె వద్ద స్కూటీ ఆపి అడ్రస్ అడుగుతున్నట్లు మాట్లాడారు. అదే సమయంలో స్కూటీపై నుంచి దిగిన మహిళ చెల్లయ్యమ్మ మెడలో ఉన్న రెండు వరుసల బంగారు నల్లపూసల గొలుసు, బంగారు పుస్తులతో ఉన్న పుస్తుల తాడును బలవంతంగా లాక్కొని, వెంటనే స్కూటీపై పరారయ్యింది. పురుషుడు హెల్మెట్ ధరించగా, మహిళ ముఖానికి నల్లని మాస్క్ ధరించి ఉండడంతో వారిని గుర్తించడం కష్టమైంది.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు బాధితురాలి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ (క్రైమ్స్), ఏసీపీ (క్రైమ్స్) పర్యవేక్షణలో వెస్ట్



సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించడంతో పాటు దోచుకున్న బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితులు

మాదివాడ ధనలక్ష్మి (38) రామా టాకీస్ సమీపం, విశాఖపట్నం. మాదివాడ అక్షిత్ (19) ధనలక్ష్మి కుమారుడు. ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి ఆస్తిని రికవరీ చేసిన వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి ఎస్ఐతో పాటు దర్యాప్తులో పాల్గొన్న ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లను నగర పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కేసు ఛేదనతో పెందుర్తి ప్రాంతంలో వరుసగా జరుగుతున్న చైన్ స్నాచింగ్ ఘటనలపై పోలీసులు కఠిన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## జీ.కే.వీధిలో జాయింట్ కలెక్టర్ పర్యటన

- 73 ఈఎఫ్ దరఖాస్తుల సేకరణ




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 6:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని డి. అగ్రహారం గ్రామంలో ఉన్న 23వ పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ సోమవారం సందర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారం (ఈఎఫ్) సేకరణ ప్రక్రియను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 73 ఈఎఫ్ దరఖాస్తులు సేకరించినట్లు అధికారులు తెలిపారు. సేకరించిన అన్ని దరఖాస్తులను సోమవారం రాత్రికే పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు (డిజిటలైజేషన్) చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 12 వ వార్డులో రోజు రోజుకి పెరుగుతున్న త్రాగునీటి కష్టాలు

- రోజు విడిచి రోజు నీటి సరఫరా - సన్నని నీటి ధారతో నిండని బిందెలు
- పనిచేయని చేతి పంపులు - మరమత్తుకు ఎదురుచూపులు
- నీటి సమయం నీటి ధార పెంచాలంటున్న కనకదుర్గ నగర్,రాజీవ్ నగర్ పరిసర ప్రాంత ప్రజలు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జులై 6**:అడుగంటుతున్న భూగర్భ జలలు ఎండుతున్న బోర్లు,రోజు విడిచి రోజు నీటి సరఫరా, నీటి సరఫరా లో సమయపాలన,లేదు, సన్నగిల్లుతున్న జలధార, ఖాళీ బిందెలు నిండేది ఎప్పుడు అంటూ ప్రజలు జీవీఎంసీ నీటి సరఫరా పై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు,

కారణాలు ఏమైనప్పటికీ అధికారులు స్పందించి ప్రజల అవసరాలు మేరకు నీటి సరఫరా సమయానికి అదనపు సమయాన్ని పెంచి నీటి సరఫరా చేయాలని, నీటి జల ధార సన్నగా ఉండడంతో ఇచ్చిన సమయంలో కనీస ఇంటి అవసరాలు కూడా తీరని పరిస్థితిలో నీటి సరఫరా అవుతుందని,నీటి సరఫరా విభాగం అధికారులు 12వ వార్డు కనకదుర్గ నగర్ రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాలలో నీటి సరఫరా సమయాలను పరిశీలించి నీటి సరఫరా, రోజు విడిచి రోజు సరఫరా చేసే నీటి సమయంతో పాటు నీటి వేగాన్ని కూడా పెంచాలని, మరమ్మతుకుగురైన బోర్ వెల్స్ మరమత్ చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా కుళాయిలకు మూత బిగించాలని నీటిని వృధా చేయటం మాని నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది.

## జనతా కాలనీ--నందమూరి నగర్‌కు రహదారికి భూమిపూజ

- రూ.46.58 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది నందవరపు సోములు
- రోడ్లు, కల్వర్టులు, కాలువల నిర్మాణంతో మౌలిక సదుపాయాల మెరుగుదల



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 6** : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని 92వ వార్డు నందమూరి నగర్‌లో రూ.46.58 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. నందమూరి నగర్--జనతా కాలనీ మధ్య అనుసంధాన రహదారి, కల్వర్టు నిర్మాణంతో పాటు మసీదు ప్రాంతంలో రోడ్డు, కాలువలు, కల్వర్టు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల్లో భాగంగా నందమూరి నగర్ నుంచి జనతా కాలనీకి అనుసంధాన రహదారి, కల్వర్టు నిర్మాణానికి రూ.26.60 లక్షలు, అలాగే నందమూరి నగర్ మసీదు ప్రాంతంలో రోడ్డు, కల్వర్టు, కాలువల నిర్మాణానికి రూ.19.98 లక్షలు వెచ్చించనున్నారు. ఈ సందర్భంగా విశాఖ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి నందవరపు సోములు మాట్లాడుతూ, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ఆదేశాల మేరకు ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నందమూరి నగర్, జనతా కాలనీల మధ్య అనుసంధాన రహదారి కోసం స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పుడు ఆ కోరిక నెరవేరబోతోందన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులతో పాటు భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కోసం మరిన్ని నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

అనుసంధాన రహదారి నిర్మాణంతో రెండు కాలనీల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గనున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ అభివృద్ధి పనులు తమ ప్రాంతానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి దాడి రమేష్ నాయుడు, 92వ వార్డు అధ్యక్షుడు కంపర ఆనంద్, ఏఈ చంద్రబాబు నాయుడు, చింతాడ పద్మావతి, కంచిపాటి నాగమణి, పళ్ల నూకరాజు, ఉరుకూటి సురేష్, ఎం. విమల, స్థానిక నాయకులు శంకర్, దొంకాడ సతీష్, మహిళా సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష

**టిడిపి మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు**

**గూడెం కొత్తవీధి, జూలై 6 (పెన్ పవర్):** గూడెం కొత్త వీధి మండల కేంద్రంలోని 'వెలుగు' కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు గూడెం కొత్తవీధి టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు. ఈ సమావేశానికి పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని 16 పంచాయతీల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, కన్వీనర్లు, 56 పోలింగ్ బూత్‌ల బీఎల్‌ఏలు, వివిధ అనుబంధ సంఘాల చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కొండలరావు కోరారు.



## 66 వార్డులో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం నిర్వహించిన టిడిపి శ్రేణులు



**గాజువాక పెన్ పవర్, జులై 06:**జీవిఎంసీ 66 వార్డులో ఎస్ ఐ ఆర్ లో భాగంగా 66 వార్డులో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్రత సవరణపై 66 వార్డులో అవగాహన కల్పిస్తూ 210',211,212,220 బూతులలో 66 వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సర్ ప్రోగ్రాం ద్వారా ప్రతి ఇంటి దగ్గర ఫారం ను తీసుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో ఓటర్లు అందరూ కూడా తమ ఫామ్స్ ను స్వచ్ఛందంగా తీసుకొచ్చారు . ఈ కార్యక్రమంలో బిఎల్ఓ మరియు బిఎల్ఎ తో పాటు 66 వార్డ్ మైనార్టీ నాయకులు ఆన్సర్ వల్లి ,ఫరీద్ బాబా నెమత్ మోతి ఖాన్ ,సాలిహిన్ రబ్బాని, షకీల్ అన్వర్ ,బుజ్జి ,మౌలా ,భాష ఇమామ్ ,షబ్బీర్ , నంబాల రమణ , తిరుమలరావు ,వెంకటలక్ష్మి, పద్మప్రియ మరియు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రైతులకు వేరుశనగ పంటపై శిక్షణ

మండల వ్యవసాయ అధికారి "పి శివరామ ప్రసాద్" వెల్లడి



**కొయ్యూరు, పెన్ పవర్ జులై 6:** సేంద్రియ వ్యవసాయం, సమగ్ర పంటల యాజమాన్యం,పై వ్యవసాయ రైతాంగం అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి పి. శివరాం ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలో నల్గొండ పంచాయతీలో వేరుశనగ రైతులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ నూతన ఎరువులు పంపిణీ పోషక యాజమాన్య పద్ధతులతో పంటలు దిగుబడులు పెంచుకునే మార్గాలను రైతులకు వివరించారు. అదేవిధంగా ఏపీఎ ఐ ఎం ఎస్ యాప్ యొక్క ఉపయోగాలు తెలియజేసి ప్రతి రైతు పంట నమోదును చేసుకోవాలని సూచించారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసినట్లయితేనే అధిక దిగుబడును సాధించవచ్చు అని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఎం ఈ పి ఓ సత్తిబాబు పంచాయతీ కార్యదర్శి అప్పారావు రైతులు పాల్గొన్నారు

## గిరి విద్యార్థిని అనారోగ్యం మృతి



**డుంబ్రిగుడ, పెన్ పవర్, జూలై 6**:మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న గిరి విద్యార్థిని ఆదివారం అనారోగ్యంతో గురై మృతి చెందినట్లు మృతి చెందింది. కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి చెందిన బడ్నాయిని లక్ష్మీదేవి(15) పదో తరగతిలో విద్యనభ్యసిస్తోంది. పాఠశాల పునఃప్రారంభం నుంచి విద్యార్థిని పాఠశాలలోనే ఉంది .ఈనెల 4న విద్యార్థిని తండ్రి బడ్నాయిని రామస్వామి పాఠశాలకొచ్చి సెలవు అడిగి స్వగ్రామానికి తీసుకెళ్లారు. శనివారం సాయంత్రం విద్యార్థినికి అజీర్ణి ఉండడంతో బాధిత కుటుంబీకులు పోదును రాసారు. ఆదివారం ఉదయం కూడ ఇదే పద్ధతిలో పోదును రాసారు మధ్యాహ్నం హఠత్తుగా అస్వస్థతకు గురవ్వడంతో స్థానిక పీహెచ్సీ డుంబ్రిగుడలో బాధిత విద్యార్థిని తరలించారు. ఇక్కడి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించి, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య నిమిత్తం ఆదివారం సాయంత్రం అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబీకులు బోరుమంటూ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ విషయంపై ఆ పాఠశాల యాజమాన్యానికి సంప్రదించగా ఆరు నుంచి పది వరకు విద్యనభ్యసించిన బాధిత విద్యార్థిని ఇప్పటికి అనారోగ్యానికి గురి కాలేదన్నారు. నిత్యం ఆరోగ్యంగానే ఉంటూ అందరి పిల్లలతో సరదగా గడిపేదన్నారు. ఈనెల 4న బాధిత విద్యార్థిని తండ్రి పాఠశాలకొచ్చి హోమ్ సిక్ పై సెలవును అడిగి ఇంటికి తీసుకెళ్లారని సిబ్బంది పేర్కొన్నారు. విద్యార్థిని అస్వస్థతకు గురైనట్లు ఆదివారం సాయంత్రం బాధిత కుటుంబీకులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని ఆ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పద్మ తెలిపారు. అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకునేలోపు విద్యార్థిని మృతి చెందిందన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బాధిత విద్యార్థిని స్వగ్రామానికి చేరుకుని కుటుంబీకులను పరామర్శించడం జరిగిందన్నారు విద్యార్థిని మృతిపై ఉన్నత అధికారులకు నివేదికను అందజేయనున్నామని ఆమె తెలిపారు.


## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వేగవంతం చేయాలి

- జూలై 10లోగా 100 శాతం పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,జూలై 6:** ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)–2026 ప్రక్రియను వేగవంతం చేసి జూలై 10లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంతి. టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు సోమవారం ఎంపీడీవోలు, నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.వచ్చే మూడు రోజుల పాటు అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు 24 గంటలపాటు పనిచేస్తూ దరఖాస్తుల డిజిటలైజేషన్‌కు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ కనీసం 15 శాతం పురోగతి సాధించేలా కార్యాచరణ రూపొందించి, జూలై 10 నాటికి ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు.50 శాతం కంటే తక్కువ పని పూర్తి చేసిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)పై ప్రత్యేక దృష్టి సారించి, గడువులోగా లక్ష్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, ఉద్యోగులపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మూడు రోజుల పాటు సచివాలయాలు నిరంతరం అందుబాటులో ఉండాలని, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా కోరరాదని, ఆధార్ నంబర్ ఉంటే సరిపోతుందని స్పష్టం చేశారు. అలాగే ప్రింటెడ్ ఫొటోపై పట్టుబట్టకుండా డిజిటల్ ఫొటోను కూడా స్వీకరించాలని సూచించారు.మండల డిప్యూటీ ఎంపీడీవోలు సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలకు అవసరమైన అన్ని వసతులు కల్పించి లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఖర్చుల బిల్లులను కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తే వెంటనే చెల్లింపులు చేపడతామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు తెలిపారు.

## విజ్ఞాన్ లో ఏఐ టూల్స్, ఏఐ ఏజెంట్స్, రియల్ టైమ్ ఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్



**కూర్మన్నపాలెం :పెన్ పవర్,జూలై 6:**విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ ఈసీఎం విభాగం ఆధ్వర్యంలో ఏఐ టూల్స్, ఏఐ ఏజెంట్స్ అండ్ రియల్ టైమ్ ఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్" అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ , ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్, ఐఈఈఈ కమ్యూనికేషన్స్ సొసైటీ , ఐఈఈఈ ఉమెన్ ఇన్ ఇంజినీరింగ్ , సర్వజ్ఞ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు ఏఐ లోని తాజా సాంకేతిక పరిణామాలు, ఏఐ ఆధారిత టూల్స్, ఏఐ ఏజెంట్స్, రియల్ టైమ్ ఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై ప్రాయోగిక అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. నిపుణుల ఉపన్యాసాలు, ప్రత్యక్ష ప్రదర్శనలు, హ్యాండ్స్-ఆన్ శిక్షణ ద్వారా అకాడెమిక్ విజ్ఞానానికి పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

ఈ కార్యక్రమంలో సర్వజ్ఞ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, గుంటూరు వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ గణ రూపేష్ కొత్త ముఖ్య వక్తగా పాల్గొన్నారు. మాట్లాడుతూ, ఏఐ ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, ఆధునిక ఏఐ టెక్నాలజీలపై పట్టు సాధించాలని సూచించారు. అలాగే ఏఐ ఆధారిత ఆవిష్కరణలు, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, ఏఐ ఏజెంట్స్, రియల్ టైమ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌తో పాటు ఈ రంగంలో ఉన్న విస్తృత కెరీర్ అవకాశాలపై విలువైన సమాచారాన్ని అందించారు.

ఈ కార్యక్రమాన్ని ఈసీఎం విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. గురుచరణ్ సమన్వయం చేస్తుండగా, విభాగ అధ్యాపకులు సహకారం అందిస్తున్నారు.

మూడు రోజుల వర్క్‌షాప్ తొలి రోజు 135 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి రోజు నిర్వహించిన నిపుణుల ఉపన్యాసాలు, హ్యాండ్స్-ఆన్ శిక్షణ, రియల్ టైమ్ ఏఐ అప్లికేషన్ డెవలప్‌మెంట్ కార్యకలాపాల ద్వారా విద్యార్థులు ఆధునిక ఏఐ సాంకేతికతలపై ప్రాయోగిక అవగాహనతో పాటు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం పొందారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. హెచ్. దేవన్న కార్యక్రమంలో పాల్గొని వర్క్‌షాప్‌ను అభినందించారు. విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడంలో ఇటువంటి ఇండస్ట్రీ--అకాడెమియా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి సెషన్‌లో చురుకుగా పాల్గొని, నిపుణుల అనుభవాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఏఐ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

# మత్స్యకారుల బోటు ప్రమాదం

### గల్లంతైన వారి కోసం ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 6 :**ఈ నెల 4వ తేదీ మత్స్యకారుల గోటు ప్రమాదానికి గురై చిన్న వారి అన్నయ్య బోటు కింద చిక్కుకుపోగా,మిగిలిన మత్స్యకారులు రాత్రి 9 గంటల వరకు ప్రమాద స్థలం వద్దే ఉన్నారని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఇద్దరు మత్స్యకారులు గల్లంతవగా,మరో నలుగురు ఈదుకుంటూ ముందుకు వెళ్లారని చెప్పారు. వారిలో చిన్న అనే మత్స్యకారుడు అటుగా వెళ్తున్న మర్చంట్ నౌక సాయంతో సురక్షితంగా బయటపడినట్లు పత్రికా సమావేశంలో వివరాలు వెంబడించారు.

విశాఖపట్నంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం జరిగిన మత్స్యకారుల బోటు ప్రమాదంలో ఏడుగురు మత్స్యకారులు ప్రయాణిస్తుండగా, ఒకరు సురక్షితంగా బయటపడగా ఆరుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం భారత నావికాదళం, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, సంబంధిత శాఖల సమన్వయంతో ముమ్మరంగా సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించామని, గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

డీఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ, ఈ నెల 4వ తేదీ రాత్రి 11.30 గంటలకు ప్రమాదంపై సమాచారం అందిందని, వెంటనే మరుసటి రోజు ఉదయం నుంచి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో బోటులో ఏడుగురు మత్స్యకారులు ఉండగా, ఒకరు సురక్షితంగా బయటపడ్డారని, మిగిలిన ఆరుగురి కోసం నిరంతరంగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. సముద్రంలో అలలు ఉధృతంగా ఉండటం, గాలుల వేగం అధికంగా ఉండటం వల్ల సహాయక చర్యలకు కొంత ఇబ్బంది ఎదురవుతోందని తెలిపారు. ఈ నెల 10వ తేదీన విశాఖ పోర్టుకు చేరాల్సిన మర్చంట్ షిప్‌ను ముందుగానే రప్పించాలని కోరగా, అది ఈరోజు రాత్రికి చేరుకునే అవకాశం ఉందన్నారు. మరో 24 గంటల పాటు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని వెల్లడించారు.

అలాగే మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లే ముందు బోటు పరిస్థితిని పూర్తిగా పరిశీలించుకోవాలని, తప్పనిసరిగా భద్రతా పరికరాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్రాన్స్‌పాండర్లను ప్రతి ఫిషింగ్ బోటులో తప్పనిసరిగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో బోటు ప్రమాదానికి గురైందన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం చిన్న వారి అన్నయ్య బోటు కింద చిక్కుకుపోగా, మిగిలిన మత్స్యకారులు రాత్రి 9 గంటల వరకు ప్రమాద స్థలం వద్దే ఉన్నారని తెలిపారు. అనంతరం ఇద్దరు మత్స్యకారులు గల్లంతవగా, మరో నలుగురు ఈదుకుంటూ ముందుకు వెళ్లారని చెప్పారు. వారిలో చిన్న అనే మత్స్యకారుడు అటుగా వెళ్తున్న మర్చంట్ నౌక సాయంతో సురక్షితంగా బయటపడినట్లు ఎమ్మెల్యే వివరించారు.

గల్లంతైన మత్స్యకారుల కోసం ప్రభుత్వం అన్ని వనరులను వినియోగిస్తూ సహాయక చర్యలను నిరంతరం కొనసాగిస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మత్స్యకారుల గల్లంతు



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ తీవ్ర ధ్వజం

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 6:** ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మత్స్యకారులు గల్లంతు అంటూ మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. రాంనగర్ తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– గల్లంతైన ఆరుగురిని తక్షణం వెతికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని,

గల్లంతైన విషయం తెలిసిన 20గంటల దాకా సహాయక చర్యలు మొదలు కాలేదని

వైఎస్సార్సీపీ రంగంలోకి దిగిన తర్వాతనే అధికారుల్లో చలనం వచ్చిందని,

ఎంపీ భరత్, జనసేన ఎమ్మెల్యేలకు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు

మత్స్యకారుల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి లెక్కే లేకుండా పోయిందని,

-ప్రభుత్వ యంత్రాంగం, నాయకులు సమన్వయంతో పనిచేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు.

:వైఎస్సార్సీపీ హయాంలో ఏదైనా మత్స్యకారుల బోటుకు ప్రమాదం జరిగితే వెంటనే స్పందించి వారిని కాపాడేలా నిర్దిష్టమైన వ్యవస్థ, టెక్నాలజీ అందుబాటులో ఉండేదని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకారులను పట్టించుకోవడం మానేసిందని, వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీచ్ షాక్స్ పేరుతో బీచ్‌లలో మద్యం అమ్ముకోవడంలో ఉన్న శ్రద్ధ.. మత్స్యకారుల ప్రాణాలపై చంద్రబాబుకు లేదని ధ్వజమెత్తారు. గల్లంతైన మత్స్యకారులను ఎలాగైనా వెతికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రమాదం జరిగిన 20 గంటల వరకు ప్రభుత్వం స్పందించి సహాయ కార్యక్రమాలు ప్రారంభించలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ తరపున డిమాండ్ చేస్తే కానీ ప్రభుత్వంలో కదలిక రాలేదన, ఈ ప్రమాదంపై మంత్రులు లోకేష్, పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారులు గంగవరం వరకు వచ్చామని, మరో రెండు మూడు గంటల్లో ఇంటికి వచ్చేస్తామని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కానీ రాత్రయినా వారు తిరిగి రాలేదు, వారి ఫోన్లు కూడా పని చేయడం మానేశాయి. ఈ ఆందోళనకర విషయాన్ని మత్స్యకారుల కుటుంబాలు వెంటనే ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ, రాత్రి 9 గంటల వరకు ఎలాంటి సహాయక చర్యలు ప్రారంభించలేదు.

మత్స్యకారులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే స్పందించాల్సిన అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నేను స్వయంగా ఫిషింగ్ హార్బర్‌కు వెళ్లినప్పటికీ, అప్పటికి ఫిషరీస్ జేడీ అక్కడకు చేరుకోకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రమాదం జరిగి 20 గంటలు గడిచిన తర్వాత గానీ స్పందించలేదు. కేవలం ఒకే ఒక్క ఛాపర్‌ని రక్షణ చర్యల కోసం పంపించారు. మత్స్యకారుల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి ఎంత చులకనో ఈ సంఘటనే రుజువు చేస్తోంది.

వాతావరణ శాఖ హెచ్చరికలు బేఖాతర్ జూలై 3, 4 తేదీల్లో సముద్రంలో గందరగోళ పరిస్థితులు ఉంటాయని, వాతావరణం చేపల వేటకు అనుకూలంగా ఉండదని వాతావరణ శాఖ సలహా బోర్డు ముందే హెచ్చరించింది. ఇంత పెద్ద హెచ్చరిక ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీసం అలర్ట్ కాలేదు, అప్రమత్తం చేయడానికి వార్ రూమ్ కూడా ప్రారంభించలేదు. వైఎస్సార్సీపీ నాయకులు స్వయంగా రంగంలోకి దిగి, మత్స్యకారులను కాపాడాలని డిమాండ్ చేసే వరకు స్థానిక ఎమ్మెల్యే కానీ, ఉన్నతాధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానిక ఎంపీ భరత్ వీకెండ్ లో ఎంజాయ్ చేయడానికి హైదరాబాద్ వెళ్లిపోయాడు. రాత్రయిపోయింది.. అంటూ ఆర్డీఓ, అవకాశం ఉన్నంత వరకు గాలిస్తాం.. అంటూ కలెక్టర్ ఇస్తున్న బాధ్యతారాహిత్య స్టేట్మెంట్లు చూస్తుంటే మత్స్యకారుల జీవితాలపై వీరికి ఉన్న నిర్లక్ష్యం అర్థమవుతోంది.

రాష్ట్ర హోంమంత్రి అనిత బాధితులను నేరుగా పరామర్శించాల్సింది పోయి, వీడియో కాల్ మాట్లాడి మమ అనిపించారు. విశాఖ ఎంపీ భరత్ వీకెండ్ వస్తే చాలు హైదరాబాద్ వెళ్లిపోతున్నారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగి మత్స్యకారులు గల్లంతైనా ఆయన అందుబాటులోకి రాలేదు. సంబంధిత అధికారులు, వ్యవస్థలను అప్రమత్తం చేయలేదు. అన్నీ తానే అయి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నట్టు ఫీలయ్యే మంత్రి లోకేష్ కూడా మత్స్యకారుల ఆచూకీ గల్లంతు కావడంపై ఇప్పటివరకు స్పందించలేదు, పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే జనసేన పార్టీకి చెందిన వ్యక్తి అయినా, ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సైతం ఈ దారుణంపై నోరు మెదపకపోవడం దారుణమని


వైఎస్సార్సీపీ హయాంలో ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాద సంకేతాలకు సంబంధించిన టెక్నికల్ వ్యవస్థలు సక్రమంగా పనిచేసేవి. ఏదైనా బోటు మునిగిపోయే పరిస్థితి వస్తే వెంటనే హార్బర్‌లో సిగ్నల్స్ రావడం, పొగ రావడం జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ టెక్నికల్ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు, అవి ఇప్పుడు పనిచేయడం లేదన్నారు.

ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అన్ని శక్తులను రంగంలోకి దించి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులను వెతికి తీసుకురావాలి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమ లో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షులు బోలవరపు జాన్ వెస్లీ, పార్టీ నాయకులు రెయ్యి డేవిడ్ రాజు, గనగళ్ల రామరాజు, లండ రమణ, సనపల రవీంద్ర, బిపిన్ జైన్, దొడ్డి బాపు ఆనంద్, పిన్నింట్ల రాజారెడ్డి, వాసుపల్లి ధనరాజు, గరికిన వెంకటేష్, దూడ అప్పారావు, చింతపల్లి లీల కృష్ణ, ఆకుల శ్యామ్, డైవ కుమార్, గరికిన వెంకటేష్, చేపల నూకరాజు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తక్కువగా ఉన్నారని ఉపాధ్యాయులను తొలగించడం సరికాదు

- విద్య, వైద్యమే దేశ అభివృద్ధికి అసలైన పెట్టుబడి:
- గిరి జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షులు ముర్ల వెంకట రమణ మాస్టారు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 6:** విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను తొలగించడం లేదా పాఠశాలలను విలీనం చేయడం సరైన నిర్ణయం కాదని విద్యావేత్త గిరి జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షులు ముర్ల వెంకట రమణ మాస్టారు పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంత అవసరమో, విద్య, వైద్య రంగాల బలోపేతం కూడా అంతే ముఖ్యమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులు, విద్యుత్, పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తాయని, అయితే విద్య, వైద్య రంగాల్లో చేసే పెట్టుబడి తక్షణ ఆర్థిక లాభాలను ఇవ్వకపోయినా, అది భవిష్యత్ తరాలపై చేసే అత్యంత విలువైన పెట్టుబడిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంచి విద్య నైపుణ్యం కలిగిన యువతను, మెరుగైన వైద్యం ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని వివరించారు.అభివృద్ధి చెందిన ప్రతి దేశం వెనుక బలమైన ప్రభుత్వ విద్యా వ్యవస్థ, సమర్థవంతమైన ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గిందనే కారణంతో ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం, అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడిని నియమించడం, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా ప్రజలు ప్రైవేట్ వైద్య సేవలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల సంఖ్యను కాకుండా విద్యా నాణ్యతను ప్రామాణికంగా తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. విద్య, వైద్య రంగాల్లో నేడు చేసే పెట్టుబడి రేపటి విజ్ఞానవంతమైన, ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అవుతుందని, అదే దేశ ఆర్థికాభివృద్ధికి, సామాజిక ప్రగతికి నిజమైన బలమని ముర్ల రమణ మాస్టారు పేర్కొన్నారు. భవనాల నిర్మాణం కంటే విద్య, వైద్య రంగాల బలోపేతమే దేశాన్ని నిజమైన అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ఆయన అన్నారు.

# జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా యాంటీ రేబీస్ టీకా శిబిరం
- పెంపుడు కుక్కలకు టీకాలు ప్రతి ఒక్కరు వేయించాలి.
- మండల పశువైద్యాధికారి లావాటి ప్రదీప్ కుమార్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 06.**జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజల ప్రాప్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి లావాటి ప్రదీప్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచింగిపుట్టు పశువైద్యశాలలో జూనోటిక్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు ప్రతి ఒక్కరు వేయించాలన్నారు. జంతువుల నుండి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులు, వాటి నివారణ చర్యలు, రేబీస్ వ్యాధి తీవ్రతను గూర్చి వివరిస్తూ పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాల్సిన అవసరం ఉందనీ ఆయన అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రజారోగ్య పరిరక్షణపై పశుపాలకులకు, పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పించారు. అలాగే లబ్ధిదారులకు ఉచిత పశువైద్య ఔషధ నమూనాలను పంపిణీ చేశారు. ప్రతి పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు సంవర్ధక అధికారి డా జ్యోతి స్వరూప, పశువైద్య సహాయ శస్త్ర వైద్యురాలు, హేమలత, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ వరలక్ష్మి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పాల్గొన్నారు.




# ఆకులూరి కల్వర్టు నిర్మాణంలో నాణ్యత లోపం..!


**కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం**

**భారీ వర్షాలకు కొట్టుకుపోతుందేమోనని ఆందోళన**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 6:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలోని ఆకులూరి గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డు కల్వర్టు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా సాగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, కల్వర్టు బేస్‌మెంట్ నిర్మాణం నుంచి సిమెంట్ కాంక్రీట్ పనుల వరకు నాణ్యత లోపించిందని, నిర్మాణం పూర్తికాకముందే పలు చోట్ల లోపాలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. దీంతో ఈ కల్వర్టు భారీ వర్షాలను తట్టుకునే పరిస్థితిలో లేదని, స్వల్ప వరదలకే దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు లేదా తుపాను ప్రభావం ఏర్పడితే కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. అలా జరిగితే ఆకులూరి గ్రామానికి బాహ్య ప్రపంచంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణ పనుల నాణ్యతపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నాసిరకం నిర్మాణాన్ని తొలగించి బలమైన కల్వర్టును నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలు, రవాణా భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







# రూ.25 లక్షలతో రామచంద్రపురంలో 6 అభివృద్ధి పనులకు శంకుస్థాపన



- మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో పట్టణానికి వరుసగా నిధులు
- వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, పెన్ పవర్ జూలై 6:** రామచంద్రపురం పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో మంజూరైన రూ.25 లక్షల నిధులతో చేపట్టనున్న ఆరు అభివృద్ధి పనులకు సోమవారం కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం,మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి వాసంశెట్టి సుభాష్ నిరంతరం అభివృద్ధి నిధులు తీసుకొస్తూ రామచంద్రపురాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలోనే సుమారు రూ.60 కోట్లతో రహదారులు,సీసీ డ్రైన్లు,పారిశుద్ధ్య వసతులు,ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ రూపురేఖలను మార్చివేశామని తెలిపారు.ప్రస్తుతం ప్రారంభించిన పనులు పూర్తయిన తర్వాత ఆయా వార్డుల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షపు నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు:

21వ వార్డు: ముచ్చుమిల్లి రోడ్డులో ఏబీసీ స్కూల్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణం -- రూ.3.09 లక్షలు.21వ వార్డు: ముచ్చుమిల్లి రోడ్డులో మరో సీసీ రోడ్డు నిర్మాణం -- రూ.3.11 లక్షలు.

22వ వార్డు: బుల్లెట్ నాగేశ్వరరావు వీధిలో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణం -- రూ.3.86 లక్షలు.4వ వార్డు: మోడ్రన్ కాలేజీ వరకు సీసీ డ్రైన్ నిర్మాణం -- రూ.3.66 లక్షలు.10వ వార్డు: పోలీస్ క్వార్టర్స్ నుంచి ఏరియా ఆసుపత్రి ప్రధాన రహదారి వరకు సీసీ డ్రైన్ నిర్మాణం -- రూ.2.58 లక్షలు.11వ వార్డు: ధనకోటి లేఅవుట్‌లో బంధన్ బ్యాంక్ నుంచి పార్క్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం -- రూ.2.49 లక్షలు. ఇవేకాకుండా పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు వాసంశెట్టి సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ,కూటమి పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ర్యాబిస్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో అవగాహన కార్యక్రమం
- 80 కుక్కలకు ఉచిత ర్యాబిస్ టీకాలు




**రామచంద్రపురం, పెన్ పవర్ జూలై 6:** ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం ప్రభుత్వ పశువైద్యశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జోనోసిస్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం, ర్యాబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వక్తలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎన్. అనిత హాజరై ర్యాబిస్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పశువైద్య శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, జంతు ఆరోగ్యాన్ని కాపాడితేనే ప్రజారోగ్యం సురక్షితంగా ఉంటుందని అన్నారు. పెంపుడు కుక్కలు, పిల్లులు వంటి జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ నివారణ టీకాలు వేయించాలని, జోనోసిస్ వ్యాధులపై ప్రతి కుటుంబానికి అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, పశువైద్య శాఖ చేపడుతున్న ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, అవగాహనతోనే ర్యాబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని చెప్పారు.



రామచంద్రపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఓ. రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ పశువైద్యశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జోనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం పశువైద్యశాలలో సుమారు 80 కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ నివారణ టీకాలు వేశారు. ర్యాబిస్ వ్యాధి నివారణకు టీకాలే శాశ్వత రక్షణ అని పశువైద్య నిపుణులు వివరించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి డాక్టర్ జి. విజయదుర్గ (నరసాపురపుపేట),టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ,పారా వెటర్నరీ సిబ్బంది,పశు సంవర్ధక సహాయకులు,శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 06:**స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా అంబాజీపేటలోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం లో ఉన్న ఆయన విగ్రహానికి ఎం.పిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ మాట్లాడుతూ ఆయన సేచేసిన సేవలను కొయాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేరి కామేశ్వరరావు , జడ్పీటిసి బూడిద వరలక్ష్మి , ఎపిడివొ బి. మమత, గన్నవరపు శ్రీ నివాసరావు, నాగవరపు నాగరాజు, ఉందుర్తి నాగబాబు, కుసుమ వనజ కుమారి, మైలా ఆనందరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ఓట్ల వెరిఫికేషన్ వేగవంతం





**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 6:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని57,58 59,60, 61 62,వ పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. యూనిట్ ఇంచార్జ్ కందుల రాంబాబు, అన్నారు.59బూత్ ఇన్‌చార్జ్ అత్తిలి చిరంజీవి, బి.ఎల్.ఓ. శిరీష ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, జాబితాలోని సమాచారాన్ని క్షుణ్ణంగా ధృవీకరిస్తున్నారుఈ సందర్భంగా కొత్తగా ఓటు హక్కుకు అర్హత పొందిన .యువత ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే చిరునామా మార్పు, పేరు, వయస్సు లేదా ఇతర వివరాల్లో ఏవైనా సవరణలు అవసరమైతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయడమే ఈ ప్రత్యేక వెరిఫికేషన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.ఓటర్ల సహకారంతో వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా అందిస్తూ కార్యక్రమానికి మంచి సహకారం అందిస్తున్నారని బూత్ ఇన్‌చార్జ్ అత్తిలి చిరంజీవి తెలిపారు. బి.ఎల్.ఓ. శిరీష మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా తమ పేరు జాబితాలో లేకపోతే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమం పూర్తయ్యే నాటికి ర్యాలి గ్రామంలోని ఓటర్ల జాబితా మరింత ఖచ్చితత్వంతో సిద్ధమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏలేశ్వరం అంబేద్కర్ గురుకులంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6:** ఏలేశ్వరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తు న్నారు. ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ తమ సొంత ఖర్చులతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శారద అభ్యర్థన మేరకు సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) సొంత నిధులతో ఈ పనులు నిర్వహించారు.ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కళాశాల ప్రాంగణంలో గడ్డి, చెత్త పేరుకుపోయి పారిశుధ్య సమస్య ఏర్పడిందని ప్రిన్సిపాల్ శారద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ట్రస్ట్ ద్వారా ప్రాంగణంలోని గడ్డి, చెత్తను తొలగించి పరిసరాలను పూర్తిగా పరిశుభ్రం చేసే పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ విద్యార్థినులు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యాసంస్థల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమం కోసం సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ తరఫున సహకారం కొనసాగుతుందని అన్నారు. మరో ఐదు రోజులపాటు కళాశాల ప్రాంగణం అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పని కొనసాగుతుందన్నారు. ఈగలు దోమలు, విషపురుగులు ప్రాంగణంలో లేకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు చేపడుతున్నామని, పిల్లలకు ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఆటస్థలం సిద్ధం చేస్తున్నామన్నారు. పిల్లలు చదువుకునేందుకు ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, మండల విద్యాశాఖ అధికారి బి. అబ్బాయి, ప్రిన్సిపాల్ శారద, కళాశాల సిబ్బంది, చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలి, ఓటును రెన్యువల్ చేసుకోవాలి




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 06:** ఓటు హక్కు బవిలువైనదని ప్రతీ ఒక్కరూ ఓటును రెన్యువల్ చేసుకోవాలని గత 21రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సర్ స్పెషల్ ఇంటెన్స్ రీజియన్ ఓటును రెన్యువల్ చేసుకునే కార్యక్రమం జరుగుచున్నదని పి గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ సూచించారు. పి. గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 19లక్షల 9,134 ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 12 లక్షల 3779 ఓటర్లు రెన్యువల్ చేసుకున్నారు. ఇంకను 7లక్ష ల 5355 మంది ఓటర్లు రెన్యువల్ చేసుకోవాల్సి ఉన్నది. సమయం 8 రోజులు మాత్రమే ఉందని అన్నారు. బిఎల్ఓ ద్వారా ధరఖస్తులు తీసుకుని పూర్తిచేసి తిరిగి ఇవ్వ లేదో అటువంటివారు వెంటనే పూర్తి చేసి ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు కష్టపడి పనిచేసిన నాయకులు కార్యకర్తలు ఈ ఎనిమిది రోజులు కష్టపడి ఈ ఫార్ములా బిఎల్ ఓ లకు అందజేసే విధంగా ప్రయత్నం చేయాలని కోరరారు. ఓటు చాలా విలువైనది ప్రతి రాజకీయ నాయకుడు కు ఓటు యొక్క ప్రాధాన్యత కలిగినదని ఒక్క ఓటు గెలుపు ఓటములను ప్రభావితం చేస్తుంది. కాబట్టి రాజకీయ నాయకులు మీద ఈ బాధ్యత ఎక్కువ ఉంది కాబట్టి తక్షణం ప్రతి అర్హత కలిగిన ఓటు రెన్యువల్ అయ్యేలా చూడాలని కోరుతున్నానిఅన్నారు.

# శ్రీ సత్య దేవుని నిత్య అన్నదాన పథకానికి రూ. 1,00,000లు విరాళం



**అన్నవరం పెన్ పవర్ జులై 6:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కాకినాడ వాస్తవ్యులు ఎం శ్రీధర్ రూ. 1,00,000లు విరాళంగా దేవస్థానాధికారి భాస్కరరావుకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో మార్చి ఒకటో తారీఖున ఎం. సూర్రి రెడ్డి పేరు మీద అన్నదానం జరిపించవలసిందిగా దాత కోరినారు. దాతను భాస్కరరావు అభినందించారు.

# శ్రీ సత్య దేవుని దర్శించుకున్న పుదుచ్చేరి యానం ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు



**అన్నవరం పెన్ పవర్ జులై 6:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దర్శనార్థం పుదుచ్చేరి మంత్రి యానం ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు సతీమణి శ్రీ స్వామివారి సన్నిధికి సోమవారం విచ్చేశారు. మల్లాడి దంపతులకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారి వ్రతం ఆచరించారు. వ్రతం అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి వి గోపాలకృష్ణ రావు



**అన్నవరం పెన్ పవర్ జులై 6:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దర్శనార్థం ఏపీ హైకోర్టు జడ్జ్ వి. గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. డిసి బాబురావు శ్రీ స్వామి వారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

# కిర్లంపూడిలో డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి వేడుకలు.

- **దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివి.**
- **కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 6:** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి వేడుకలు కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆయన ఆశయాలను స్మరించుకుంటూ,
శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా
మండల అధ్యక్షులు రాజబాబు మాట్లాడుతూ
దేశ విదేశాల్లో ఆయన చేసిన సేవలు, జమ్మూ కాశ్మీర్ విలీనం కోసం ఆయన చేసిన పోరాటం అభినందనీయమన్నారు.
"ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు గుర్తులు, ఇద్దరు ప్రధానులు ఉండకూడదని నినదించి, కాశ్మీర్ భారత్‌లో పూర్తిస్థాయిలో విలీనం కావడానికి ప్రాణాలర్పించిన మహానీయుడు డా. శ్యామప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు, కాకినాడ జిల్లా ఓబీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శరకణం కన్నారావు, మండల ఓబీసీ మహిళా అధ్యక్షులు తణుకు మంగతాయారు, మండల ఉపాధ్యక్షుడు



బుద్ధ పెద్దకాపు, మండల ఓబిసి అధ్యక్షులు పెంటకోట కృష్ణ, పెంటకోట రాజు, శివ,పలువురు బిజెపి నాయకులు, సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు ఈసరపు శివబాబు, కోలా కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించాలి....



### ఆర్ జె డి నాగమణి

**శంఖవరం పెన్ పవర్ జులై 06:-** చదువులో వెనుకబడిన సి, డి గ్రేడ్
విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి, వారికి అదనపు శిక్షణ అందించడం ద్వారా వారి ప్రతిభను మెరుగుపరచాలని ఆర్ జె డి నాగమణి సూచించారు.పీఎం శ్రీ స్కూల్స్ విజిట్లో భాగంగా కాకినాడ జిల్లా ఆర్జేడి నాగమణి, ఏఎంఓ శ్రీ జగన్మోహన్, శంఖవరం మండల విద్యాశాఖ అధికారి ఎస్. రమణ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శంఖవరం ఏపీ మోడల్ స్కూల్ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగు తున్న అభివృద్ధి పనులు, విద్యా సదుపాయాలు, బోధనా విధానాలను వారు సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా నిర్మాణంలో ఉన్న కొత్త తరగతి గదులను అధికారులు పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్, ఏటిఎల్, పాల్, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్లను సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న పరికరాలు, విద్యార్థులకు అందుతున్న ప్రయోగాత్మక బోధన అవకాశాలను పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యా వాతావరణం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడి నాగమణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు క్రమశిక్షణతో, లక్ష్యసాధన దిశగా శ్రమిస్తూ చదువులో మరింత రాణించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న అవకాశాలు, సౌకర్యాలను పూర్తిగా వినియోగించు
కోవాలని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో సమయపాలన, పునశ్చరణ, నిరంతర సాధన ఎంతో కీలకమని వివరించారు. అలాగే చదువులో వెనుకబడిన సి, డి గ్రేడ్ విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి, వారికి అదనపు శిక్షణ అందించడం ద్వారా వారి ప్రతిభను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వ్యక్తిగత శ్రద్ధతో బోధన అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి, బోధనా నాణ్యతపై అధికారులు ఉపాధ్యాయులతో కూడా చర్చించారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికారుల సందర్శనను స్వాగతించి, వారి సూచనలు తమకు మార్గదర్శకంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్
వీర రాజు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధులు డా. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 06:** సమాజ సేవను, ప్రజల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేసిన మహనీయులు డా. బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు నివాళులర్పించారు. స్థానిక బస్టాండు సమీపంలో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆశయాలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని వారి ఆశయాలు, సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఉన్నారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం టిడిపి కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, సొసైటీ అధ్యక్షులు అరిగెల ,మైపాల తాతాజీ, ఉందుర్తి నాగబాబు, దొమ్మేటి సాయికృష్ణ, మాచవరపు శివన్నారాయణ, తొత్తరమూడి గోవిందు, నేదునూరి రాజ్ కుమార్, ఈతకోట నాగరాజు, దిగుమర్తి చిట్టిబాబు, నేదునూరి పెద్దిరాజు, ఈతకోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్యకు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం.





- **సోమరాయణంపేటలో 59.40 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రారంభం,**
- **వాటర్ ట్యాంకును ప్రజలకు అంకితం చేసి మహిళలకు స్వయంగా నీళ్ళ బిందెలను అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.**

**కిర్లంపూడి,పెన్ పవర్,జూలై 6:** కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాలకు మౌలిక వసతులకు తొలి ప్రాధాన్యం ఇస్తుందని దీనికి నిదర్శనంగా కిర్లంపూడి మండలం సోమరాయంపేటలో జల జీవన్ మిషన్ నిధులు 59.40 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. వాటర్ వాటర్ ట్యాంక్ ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయడమే కాకుండా, మహిళలకు స్వయంగా నీళ్ల బిందెలను అందించారు. ఇకపై గ్రామంలోని 350 కుటుంబాలకు సురక్షిత తాగునీరు అందుతుందన్నారు.గత ప్రభుత్వం నీటి ప్రాజెక్టులను గాలికొదిలేసిందని కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందన్నారు. చంద్రబాబు విజన్, పవన్ కళ్యాణ్ చొరవతో పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయన్నారు.ఇది కేవలం ట్యాంక్ కాదు, ప్రజల ఆరోగ్యానికి మేం ఇస్తున్న భరోసా అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, క్లస్టర్ ఇంచార్జి, పాఠంశెట్టి మురళీకృష్ణ, అనుకుల శ్రీకాంత్, నీలం శ్రీను, కంచుమర్తి రాఘవ, ఎంపీడీఓ బాయిశెట్టి హరికృష్ణ, పెనగంటి బాబ్జి, పీలా మహేశ్వరరావు, కాంట్రాక్టర్ సాయిబాబా, డి ఈ ఈ, ఎంఎస్ స్వామి, ఏ ఈ, బి అప్పలరాజు అధిక సంఖ్యలో కుటమి నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు మరో అడుగు.. కొత్తపేట పోలీసులకు ఐదు సీసీ కెమెరాలు అందజేత




**కొత్తపేట,పెన్ పవర్,జూలై 6:**
నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు కీలకమని భావిస్తూ కొత్తపేట మండలంలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయి. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళి మోహన్ పర్యవేక్షణలో, రావులపాలెం రూరల్ సీఐ చి. విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ నేపథ్యంలో కొత్తపేట ఎస్ఐ జి. సురేంద్రకు సోమవారం కొత్తపేట గ్రామ ఇటుక బట్టీల యూనియన్ ప్రతినిధులు ఐదు సీసీ కెమెరాలను అందజేశారు. ప్రజల భద్రతకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కెమెరాలను పోలీసు శాఖకు అందించినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.అందిన సీసీ కెమెరాలను కొత్తపేట మండలంలోని నేరాలు జరిగే అవకాశమున్న ప్రాంతాలు, తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రదేశాలు, రద్దీ కూడళ్లు వంటి కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ జి. సురేంద్ర తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నివారణతో పాటు నేరస్థుల గుర్తింపు, ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాల విచారణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు.
పోలీసుల భద్రతా చర్యలకు ప్రజలు, వ్యాపార వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఇటుక బట్టీల యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com